

రండి.. డిగ్రీలో చేరండి

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా మొదటి విడత రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి.

10లో



మా లక్ష్యం.. ఒకే ఎన్నిక

ఎవరు ఎన్ని విమర్శలు చేసినా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అనేది బీజేపీ విధానమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.

10లో

గరిష్ఠం / కనిష్ఠం
40° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ఠస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

'సిందూర్' విజయవంతం కావాలని పూజలు



జమలాపురంలో హోమం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం/కూసుమంచి: పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను తుదముట్టించేలా భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతి హోమం చేసిన అర్చకులు, భారత సైన్యానికి మేలు జరగాలని, వారి కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలని పూజలు జరిపించారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తల్లపురెడ్డి నాగిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, గుడేటి బాబురావు, శ్రీనివాసరావు, ఎన్.రామారావు పాల్గొన్నారు. అలాగే, కూసుమంచిలోని శివాలయంలో కూడా పూజలు చేయగా, ఈఓ శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా శిక్షణ కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వనుండగా, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో గణితం సబ్జెక్టుగా 60శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), డిప్లొమా(సివిల్), బీటెక్(సివిల్) లేదా సమానమైన విద్యార్హత ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల్లో ఓసీలైతే 50రోజుల శిక్షణకు రూ.10వేలు, బీసీలు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 83748 79945, 97054 39983, 96769 64860 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

31వరకు ఓపెన్ వర్సిటీ ఫీజు గడువు

ఖమ్మంసహకారనగర్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీ 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షలకు అభ్యర్థులు ఈనెల 31లోగా ఫీజు చెల్లించాలని ఖమ్మం రీజినల్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న సూచించారు. వివరాలు, ఫీజు చెల్లింపు కోసం www.braouonline.ac.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

- కల్లూరు ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కల్లూరు: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంగా వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలే తప్ప నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ వినీత్ పలువురికి చికిత్స చేస్తుండగా పరిశీలించారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్‌తో మాట్లాడి పరీక్షలు, మందుల లభ్యతపై ఆరాతీశారు. మందులు సరిపడా సిద్ధంగా ఉంచుకోవాలని, ఏవైనా తక్కువగా ఉంటే ముందుగానే తెప్పించుకోవాలని సూచించారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, వైద్యాధికారి నవ్యకాంత్, ఉద్యోగులు ఎం.లలిత, జె.మాధవి, అనూష, అక్తర్, మధు, బి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

పెనుబల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. పెనుబల్లి మండలం మండాలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, రవాణాపై ఆరా తీశాక కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కాంటా వేయించి మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, తహసీల్దార్ గంటా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపాదిత తీగల వంతెన చిత్రం

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నగరానికి కొత్త సొబగులు అద్దనున్నాయి. రూ.వందల కోట్ల నిధులతో చేపడుతున్న పనులను నిత్యం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యవేక్షిస్తున్నారు. దీంతో పనుల్లో వేగం పెరిగేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉంటున్నారు. మున్నేటికి రిటైనింగ్ వాల్ నిర్మాణంలో కొంత అడ్డంకిగా ఉన్న భూ సేకరణ సమస్య కూడా పరిష్కారమైతే నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. – ఖమ్మం అర్బన్

మున్నేరు తీరం.. అభివృద్ధి మంత్రం

పరీవాహకంలో రూ.వందల కోట్లతో పనులు

- చకచకా సాగుతున్న తీగల బ్రిడ్జి, రిటైనింగ్ వాల్ నిర్మాణం
- తద్వారా ముంపు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
- ఆ తర్వాత పర్యాటక సొబగులు కూడా..

ప్రకాష్‌నగర్ వద్ద మరమ్మతులు

ప్రకాష్‌నగర్ వద్ద ఉన్న హై లెవెల్ వంతెన గత ఏడాది వచ్చిన వరదతో దెబ్బతిన్న విషయం విదితమే. దీంతో బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపివేసిన అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. దాదాపు రూ.కోటి వ్యయంతో చేపట్టిన పనులు పూర్తవడంతో అవసరమైన అప్రోచ్ రోడ్లు కూడా నిర్మించడంతో సాఫీగా రాకపోకలు సాగుతున్నాయి.

పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ

తీగల వంతెనతో పాటు రిటైనింగ్‌వాల్ నిర్మాణంతో పూర్తయితే అటు రవాణా ఇక్కట్లు, ఇటు ముంపు సమస్య తీరిపోతుంది. ఆపై మున్నేరు పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బ్రిడ్జి, రిటైనింగ్ వాల్ వెంట వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, లైట్ల ఏర్పాటు తదితర పనులకు కార్యాచరణ సిద్ధమైనట్లు సమాచారం. ఇవన్నీ కార్యరూపం దాలిస్తే నగరవాసులకు కొత్త అందాలు అందుబాటులో వస్తాయని చెప్పొచ్చు.

రవాణా ఇక్కట్లు తీర్చేలా..



మున్నేరుపై కొనసాగుతున్న తీగల వంతెన పనులు

మున్నేటిపై పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో అనుబంధంగా రవాణాకు ఇబ్బంది ఎదురుకాకుండా తీగల(కేబుల్) వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించింది. ఖమ్మం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు తీర్చేలా ఈ నిర్మాణం చేపట్టారు. మొత్తం 14 పిల్లర్లతో నిర్మించనున్న ఈ వంతెనలో భాగంగా మున్నేరు మధ్యలో నాలుగు ప్రధాన పిల్లర్ల పనులు చివరి దశకు చేరాయి. రెండేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తద్వారా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ భారం తగ్గడమేకాక జిల్లా వాసులను ఆకట్టుకునేలా కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తుంది.

రిటైనింగ్ వాల్‌తో భద్రత



కరుణగిరి వద్ద నిర్మాణంలో ఉన్న రిటైనింగ్‌వాల్

ఏటా వర్షాకాలంలో వస్తోందంటే మున్నేటి పరీవాహకంలోని ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతుంటారు. ఎప్పుడు వరద ముంచెత్తుతుందోనన్న భయం వారిని వెంటాడుతుంటుంది. దీన్ని అరికట్టేలా రెండు వైపులా మొత్తం 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చేపట్టారు. రూ.690 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ నిర్మాణం ప్రభుత్వ భూముల్లో చకచకా సాగుతోంది. ప్రైవేట్ భూములు సేకరించాల్సిన చోట జాప్యం జరిగినా, ఇప్పుడు ఆ సమస్యలు కూడా ఓ కొలిక్కి వచ్చాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

కదం తొక్కిన జర్నలిస్టులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, సంఘాల నాయకులు

- 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో సోదాలపై నిరసన
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అక్కడి పోలీసుల తీరుపై ఆగ్రహం

ఖమ్మంమయూరిసెంటర్: 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఏపీ ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడాన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. ఎలాంటి నోటీసులు లేకుండానే విజయవాడలోని ఎడిటర్ ఇంట్లోకి ప్రవేశించడం ద్వారా ఏపీ ప్రభుత్వం జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన ఖమ్మంలో జెడ్పీ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

జర్నలిజంపై ముప్పేట దాడి


టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన జర్నలిస్టు వ్యవస్థపై తెలుగు రాష్ట్రాల్లో దాడి జరుగుతోందన్నారు. పాలకులు వారికి అనుకూలంగా మాత్రమే వార్తలు రాయాలని కోరుకుంటుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని తెలిపారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు అక్రమంగా జొరబడడం గర్హనీయమన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరగడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై జరిగిన దాడికి ఏపీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాలకులు ప్రజామన్ననలు చూరగొనేలా పాలించాలే తప్ప వారికి వ్యతిరేక వార్తలు రాశారని జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత హేయనీయమని తెలిపారు. పత్రికా, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగేలా ఇలాంటి దాడులు చేయడాన్ని తమ యూనియన్ ఖండిస్తోందన్నారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, బాధ్యులు గుద్దేటి రమేష్, కొరకొప్పుల రాంబాబు, యలమంద జగదీష్, టీఎస్ చక్రవర్తి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, బాధ్యులు మొయినుద్దీన్, శివానంద, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, కూరాకుల గోపి, వేగినాటి మాధవరావు, మహిళా ప్రతినిధులు మధుశ్రీ, వంగూరి ఈశ్వరి, జర్నలిస్టులు మారెడ్డి నాగేందర్‌రెడ్డి, పి.సత్యనారాయణ, 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ, టీవీ ప్రతినిధి పి.మహేందర్‌కుమార్, ఏసీఎం శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ నిరసనకు ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు

లాభాల బాటలో రైతన్న

- సంప్రదాయ పంటలకు బదులు అరటి, జామ తోటలు
- సేంద్రియ విధానంలో సాగు, తోటల వద్దే అమ్మకం
- మిగతా పంటలతో పోలిస్తే లాభాలపై భరోసా



జామ తోటలో సామినేని రమేష్

ముదిగొండ: ఈ రైతులు కూడా అందరిలాగే వరి, మిర్చి, పత్తి పంటలను ఏళ్ల తరబడి సాగు చేశారు. కానీ మారుతున్న వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు వారిని వెంటాడాయి. ఫలితంగా ఏళ్లు గడుస్తున్న కొద్ది పెట్టుబడి పెరుగుతుందే తప్ప లాభాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఏం చేయాలా అని ఆలోచిస్తున్న ఆ రైతులకు పండ్ల తోటలు కళ్ల ముందు కనిపించాయి. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ విధానంలో పంటల సాగు ఆరంభించిన వారు ఇప్పుడు అధిక దిగుబడి సాధిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకపోవడంతో పండ్లు రుచికరంగా ఉండగా.. వ్యాపారులే తోటల వద్దకు కొనుగోలు చేస్తుండడంతో రవాణా ఖర్చులు తగ్గి లాభాలు లాభాలు ఆర్జిస్తున్నారు. ముదిగొండ మండలం మేడేపల్లిలో పలువురు రైతులు ఈ బాటలో పయనిస్తుండగా ఆ గ్రామ రైతులే కాక చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా వీరిని అనుసరించేందుకు సిద్ధమవుతున్నారు.

జామ.. తైవాన్ పింక్

ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన సామినేని రమేష్ ఏడాదిన్నర క్రితం ఏపీలోని జంగారెడ్డిగూడెం వద్ద నర్సరీలో 19వేల తైవాన్ పింక్ జామ మొక్కలు తీసుకొచ్చాడు. ఒక్కో మొక్కకు రూ.15 వెచ్చించగా.. ఎకరానికి 1,300 చొప్పున 20ఎకరాల్లో సాగు చేశాడు. డ్రిప్ ఇరిగేషన్, పైపులు, బావి, ఫెన్సింగ్, కూలీలు, మొక్కలు కలిపి రూ.20లక్షల మేర పెట్టుబడి అయింది. డ్రిప్ ఇరిగేషన్ విధానం కావడంతో నీరు, ఎరువులు మొక్కకు నేరుగా అందించడం సాధ్యమవుతోంది. మొక్కలు నాటాక ఎనిమిదో నెల నుంచి జామ దిగుబడి మొదలైంది. మొదటి కాపు 75టన్నులు రాగా.. కిలో రూ.25నుంచి రూ.30 వరకు తోట దగ్గరే విక్రయించానని రమేష్ తెలిపారు. ఇక వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక యంత్రాన్ని అమర్చడంతో ముందు జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యమవుతుందని వెల్లడించారు. ఈ యంత్రానికి రూ.50వేలు వెచ్చించినట్లు తెలిపారు. కాయలకు మచ్చలు రాకుండా, చీడపీడలు ఆశించకుండా కవర్లు తొడగడం... సేంద్రియ విధానం కావడంతో కాయలు రుచిగా ఉండి వ్యాపారులు నేరుగా తోట వద్దకు కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. ఫలితంగా తనకు రవాణా ఖర్చులు తగ్గాయని తెలిపారు.



వాతావరణాన్ని గుర్తించే యంత్రం వద్ద రైతు..

అటు అరటి.. ఇటు జామ

మేడిపల్లి గ్రామానికే చెందిన మేడిశెట్టి నరసింహారావు అరటి సాగు చేస్తున్నారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజోలులో ఒక్కో మొక్క(దుంప) రూ.10 చొప్పున తీసుకొచ్చి ఎకరానికి వెయ్యి మొక్కలు నాటారు. ఎకరాకు రూ.30 వేలు ఖర్చు కాగా.. కర్పూర రకం మొక్కలు కావడంతో నాటిన 11నెలలకు దిగుబడి వచ్చింది. టన్ను రూ.14వేల నుంచి రూ.20వేలు వరకు తోట దగ్గరే అమ్ముతున్న ఆయన ఎకరాకు రూ.లక్ష మేర లాభం వస్తోందని తెలిపారు. దీనికి తోడు అంతర పంటగా జామ కూడా సాగు చేస్తుండగా అదనపు ఆదాయం లభిస్తోందని వెల్లడించారు.



అరటి తోటలో అంతర పంటగా జామ చెట్లు



అరటి గెల చూపిస్తున్న మేడిశెట్టి నరసింహారావు

'సీతారామ'తో జిల్లా సస్యశ్యామలం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యేలు

సత్తుపల్లిటౌన్: గోదావరి జలాల ఆధారంగా నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంటలో సీతారామ ప్రాజెక్ట్ ట్రంక్ టన్నెల్ పనులను శుక్రవారం ఆయన ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. సీతారామ మెయిన్ కెనాల్, మూడు పంప్‌హౌస్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించుకున్నామని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వచ్చే వర్షాకాలానికి వైరా ప్రాజెక్టు, పినపాక నియోజకవర్గంలోని తుమ్మలపల్లి వద్ద మారేడుపాక ఎత్తిపోతల పథకం, కొత్తగూడెం నియోజకవర్గంలో సింగభూపాలెం ద్వారా నీరు వదలాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు.

నాలుగు నెలల్లో ట్రంక్ నిర్మాణం

సత్తుపల్లి ట్రంక్ టన్నెల్‌లో మిగిలిన 1.2 కి.మీ. పనులు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. తద్వారా సత్తుపల్లి, పినపాక, మధిర, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగు నీరు అందించవచ్చని, వైరా రిజర్వాయర్ కింద లక్షా 30వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. అప్పుడు సాగర్ జలాలు రాకున్నా ఇబ్బంది ఉండదని తెలిపారు. సీతారామ ప్రధాన కాల్వలో సిల్ట్ తొలగిస్తే బేతుపల్లి, వైరా ప్రాజెక్టులోకి సాఫీగా నీరు చేరుతుందన్నారు. కాగా, ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఆర్డీఓ రాజేందర్‌గౌడ్, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, నాయకులు మట్టా దయానంద్, దోమా ఆనంద్, సుజలరాణి, దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

మార్పు పేరిట అందమైన వల

- నెత్తిపై నీళ్లు చల్లుకోవడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, పువ్వాడ అజయ్, సండ్ర తదితరులు

సత్తుపల్లి/తల్లాడ: సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు జిల్లాను సస్యశ్యామలం చేసేలా సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తే.. కాంగ్రెస్ నేతలు నీరు విడుదల చేసి నెత్తిన చల్లుకున్నారే తప్ప చేసిందేమీ లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మార్పు పేరిట ఆ పార్టీ ప్రజలపై అందమైన వల విసిరిందన్నారు. తల్లాడ మండలం మిట్టపల్లిలో శుక్రవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత పహల్గాం మృతులు, పాకిస్తాన్‌తో యుద్ధంలో అమరులైన సైనికులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేయకపోగా, రైతులకు బోనస్, భరోసా లేదు, రుణమాఫీ అంతంతే అమలుచేస్తున్నారని విమర్శించారు. జిల్లా నుంచి డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, నంబర్-2గా చెప్పుకునే మంత్రి ఉన్నా ఒరిగిందేమీ లేదని తెలిపారు.

భద్రాచలంలో ఉపఎన్నిక ఖాయం

బాండ్లు రాసిస్తాం, అఫిడవిట్ ఇస్తాం, కేసీఆర్ కంటే ఎక్కువే చేస్తామని ఎన్నికల వేళ భట్టి విక్రమార్క, చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలా చేస్తారని ప్రశ్నిస్తే వారి పార్టీకి 125 ఏళ్ల చరిత్ర ఉన్నందున సంపద సృష్టిస్తాం, వంద రోజుల్లో హామీలు అమలుచేస్తామన్న మాటలు ఏమయ్యాయని నిలదీశారు. ఇక రేవంత్‌రెడ్డి రైతుబంధు మూడు పంటలకు ఇవ్వాలని చెప్పి ఇప్పుడు ఒక పంటకు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. భద్రాచలం అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఖాయమని, ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ శ్రేణులంతా అక్కడకు వెళ్లి పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు గెలిచేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్మన్ పదవి నుంచి రాయల శేషగిరిరావును అవమానకర రీతిలో దించేశారన్నారు. ఆయన అనునిత్యం రైతుల సమస్యలపై ఉద్యమించారని, ధాన్యం కొనుగోళ్లల్లో జాప్యమైతే అప్పటి మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాయలను ఇబ్బంది పెట్టినా, నమ్మిన సిద్ధాంతాన్ని చివరి వరకు వీడలేదని తెలిపారు. తొలుత తల్లాడ మండలం రేజర్ల నుంచి మిట్టపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, రేగా కాంతారావు, బానోతు మదన్‌లాల్, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావుతో పాటు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, దిండిగాల రాజేందర్, దొడ్డా శ్రీనివాసరావు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డి.వెంకటలాల్, దిరిశాల దాసురావు తదితరులు పాల్గొన్నారు.



శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, తదితరులు

క్లుప్తంగా

రక్షణపై మాక్‌డ్రిల్‌తో అవగాహన



మాక్ డ్రిల్ చేయిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: యుద్ధం వస్తే పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు మాజీ సైనికులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఖమ్మం ఎన్నెస్పీ హైస్కూల్ సమీపంలోని ఖాళీ స్థలంలో మాజీ సైనిక ఉద్యోగులు, ఇండియన్ వెటర్న్ ఆర్గనైజేషన్ అధికార ప్రతినిధి ఎస్.ఎం.అరుణ్ పర్యవేక్షణలో ఈ డ్రిల్ జరిగింది. భవనాలపై బాంబులు పడినప్పుడు మంటల నుంచి బయటపడడాన్ని అరుణ్ ప్రత్యక్షంగా వివరించారు. అలాగే, గాయపడిన వారికి ప్రథమ చికిత్స, రాత్రి వేళ ఉనికి తెలియకుండా లైట్లు ఆర్పడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ బహదూర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో పాటు వెంకటేష్, నాళ్ల భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ఒకపూటే నిర్వహించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బోనకల్: ప్రభుత్వం ఈనెల 13వ తేదీ నుండి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనుండగా, ఎండల తీవ్రత దృష్ట్యా ఒక పూటే నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణను జిల్లా కేంద్రంలో కాకుండా డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. అలాగే, పాఠశాలలు తెరిచేనాటికి సరిపడా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సమకూర్చాలని, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు, డీఏ, పీఆర్‌సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వల్లంకొండ రాంబాబు, గుగులోతు రామకృష్ణ, రమేష్, సూర్య, తులసీదాస్, ఉద్దండ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎర్రుపాలెంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బోనకల్/ఎర్రుపాలెం: ఇప్పటికే జాప్యమైనందున ఇకనైనా ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బోనకల్ మండలం జానకీపురం, ఎర్రుపాలెం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. అలాగే, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ పేరిట కాలయాపన చేయొద్దని సూచించారు. 317 జీఓ ద్వారా ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని సవరించడమే కాక ఉపాధ్యాయ శిక్షణ జిల్లా కేంద్రంగా కాకుండా మండలాల్లో ఏర్పాటు చేయాలన్నారు. కాగా, బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల సంఖ్య పెంపునకు పాటుపడాలని సూచించారు.ఈసమావేశాల్లో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, మండలాల బాధ్యులు రామ్మోహన్‌రావు, రవికిరణ్, రవికుమార్, కొండల్‌రావు, బి.మదనమోహన్‌రెడ్డి, మారపాక బాబురావు, శెట్టిపల్లి సంగిరెడ్డి, రవికిరణ్, కొండలరావు, సత్యనారాయణరెడ్డి, ఎస్.కే.రమేష్, గోపీకృష్ణ, రేణుక, అప్పిరెడ్డి, సాంబయ్య, లింగయ్య, కృష్ణవేణి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలనలో వేగం

ఏన్కూరు: రాజీవ్ యువవికాసం పథకానికి అందిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేసి సంబంధిత కార్పొరేషన్లకు పంపించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ సూచించారు. ఏన్కూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసిన ఆమె దరఖాస్తుల పరిశీలనపై ఆరా తీశారు. త్వరగా ప్రక్రియను పూర్తి చేసి అర్హుల జాబితాను కార్పొరేషన్లకు పంపిస్తే లబ్ధిదారుల ప్రకటన సులువవుతుందని తెలిపారు. ఎంపీడీఓ జీవీఎస్.నారాయణ, సూపరింటెండెంట్ తుమ్మలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి వాగులో పడిన లారీ

ఏన్కూరు: ఇసుక తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పి వాగులో బోల్తాపడింది. భద్రాచలం నుండి ఇసుకతో లారీ ఏన్కూరు మండలం జన్నారం మీదుగా ఖమ్మం వెళ్తోంది. ఈక్రమాన గురువారం అర్ధరాత్రి జన్నారం సమీపంలో అదుపు తప్పి వాగులో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యా యి. అయితే, వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రండి.. డిగ్రీలో చేరండి

'దోస్త్' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- ఈనెల 21వరకు మొదటి విడత..
- ఆతర్వాత మరో రెండు విడతలు కూడా..
- ఉమ్మడి జిల్లాలోని 11 ప్రభుత్వ కాలేజీల్లో 5,820 సీట్లు



ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల

ఖమ్మంసహకారనగర్: ఇంటర్‌మీడియట్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడిసిన్ కోర్సుల్లో విద్యార్థులు ఆ వైపు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. అయితే, కాలం మారుతున్నా వన్నె తగ్గని డిగ్రీ కోర్సుల్లోనూ చేరేందుకు ఇంకొందరు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏటా మాదిరిగానే డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా రిజిస్ట్రేషన్ల షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటికే మొదటి విడతల షెడ్యూల్ అమల్లో ఉన్న నేపథ్యాన ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాలలు, సీట్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలపై కథనం

2వ తేదీన నోటిఫికేషన్

రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం షెడ్యూల్‌ను ఈనెల 2వ తేదీన విడుదల చేసింది. ఈనెల 3వ తేదీ నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు మొదలుకాగా, డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లోనే కాక మీ సేవ, దోస్త్ యాప్, ఆన్‌లైన్ సర్వీసెస్‌లోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మూడు విడతలుగా కొనసాగే ప్రవేశాల ప్రక్రియ కోసం విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాల, కోర్సును ఎంచుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే కాక పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కూడా ఉన్నాయి.

మూడు విడతల్లో ఇలా...

- 'దోస్త్' మొదటి విడత రిజిస్ట్రేషన్ ఈనెల 3వ తేదీన మొదలుకాగా, 21వ తేదీ వరకు రూ.200 రుసుంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 10నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశముండగా, 29వ తేదీన మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. ఆయా విద్యార్థులు ఈనెల 30నుంచి జూన్ 6తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టింగ్ చేసి నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- రెండో విడత రిజిస్ట్రేషన్‌కు రూ.400 ఫీజు చెల్లించాలి. ఈనెల 30నుంచి జూన్ 8వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండగా, ఈనెల 30నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే అదే నెల 13న సీట్లు కేటాయిస్తారు. ఈ విడతలో సీట్లు దక్కిన విద్యార్థులు వచ్చే నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఫీజు చెల్లించాలి.
- మూడో విడత రిజిస్ట్రేషన్‌లోనూ రూ.400 ఫీజుతో వచ్చే నెల 23న ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అదేరోజు నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. కాగా, 1, 2, 3 విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులంతా జూన్ 24 నుంచి 28వ తేదీల్లో ఆయా కళాశాలల్లో జరిగే ఓరియెంటేషన్ కార్యక్రమాల్లో పాల్గొని, 30న ప్రారంభమయ్యే తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్‌కు ఏమేం కావాలి?

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సమయాన ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు 6నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఇంటర్ టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో కూడా సమర్పించాలి.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, సీట్ల సంఖ్య

కళాశాల	సీట్లు
ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, ఖమ్మం	1,560
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మం	480
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర	300
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి	300
జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సత్తుపల్లి	480
శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్తగూడెం	360
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ	660
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రాచలం	780
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇల్లెందు	300
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరు	360
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అశ్వారావుపేట	240

సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీలో ప్రవేశాల కోసం విద్యార్థులు 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మూడు విడతలుగా అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే నచ్చిన కాలేజీ, కోర్సును ఎంచుకోవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.డీ.సలీంపాషా, దోస్త్ కో ఆర్డినేటర్, ఖమ్మం

మీ భూమిలో సారం ఎంత?

- మట్టి నమూనాలతో భూసార పరీక్షలు
- తగిన జాగ్రత్తలతో కచ్చితమైన ఫలితాలు
- రైతులకు వైరా కేవీకే కోర్డినేటర్, శాస్త్రవేత్తల సలహాలు



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వైరా: నేలల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలకు తోడు రైతులు అదనంగా వేసే సేంద్రియ, రసాయన ఎరువులు పంట దిగుబడి పెరిగేందుకు దోహదం చేస్తాయి. అయితే, ఏ నేలలో ఎంత మోతాదులో సారం ఉంది, అక్కడ ఏయే పంటలు సాగు చేయొచ్చు, సాగు సమయాన ఏ మేర ఎరువులు ఉపయోగించాలో తెలియాలంటే మట్టి నమూనాల పరీక్షలు చేయించడం తప్పనిసరి. ఈ పరీక్షల ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా సరిపడా మాత్రమే ఎరువులు వాడితే రైతులకు భారం తగ్గడమే కాక నేల తల్లిని కాపాడుకున్నట్లవుతుంది. ఈనేపథ్యాన మట్టి పరీక్షల కోసం నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు ఫణిశ్రీ, చైతన్య రైతులకు ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

ప్రయోజనాలు

పొలంలో ముఖ్య పోషక పదార్థాలైన నత్రజని, భాస్వరం, పోటాష్ ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే, సూక్ష్మపోషక పదార్థాలైన జింక్, మెగ్నీషియం వంటివి ఏ మోతాదులో ఉన్నాయో తెలుసుకుని లోపాలు ఉంటే సరిదిద్దడానికి అవకాశం ఏర్పడుతుంది. సాగుకు అనువుగా లేని ఆమ్ల భూములు, చౌడు భూములను గుర్తించవచ్చు. పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను సరిపడా మోతాదులో వాడడం వల్ల రైతులకు వ్యయం తగ్గుతుంది.

మెళకువలు తప్పనిసరి

మట్టి ఆరబెట్టడానికి రసాయన, సేంద్రియ ఎరువుల సంచులను వాడొద్దు. చెట్ల కింద ఉన్న పొలం భాగం నుంచి మట్టి తీయొద్దు. ఎరువు కుప్పలు వేసిన చోట, ఎప్పుడు నీరు నిలిచే పల్లపు ప్రాంతంలోని మట్టి కూడా పనికిరాదు. పొలంలో అక్కడక్కడ చౌడు ఉన్నట్లు అనుమానిస్తే ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా నమునాలు సేకరించాలి. తీసి వేరుగా చౌడు లక్షణాల పరీక్ష కోసం పంపాలి.

నమూనాల సేకరణ ఇలా..

భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించడంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు ఐదు ఎకరాలకు ఒక నమూనా తీస్తే సరిపోతుంది. ఇందుకోసం ఎంపిక చేసిన నేల పైభాగంలో చెత్తాచెదారం తొలగించి, 'వీ' ఆకారంలో నాగటి సాలు పోయేంత లోతు(15 సెం.మీ.) తవ్వి మట్టి సేకరించాలి. ఇలా 10–12 చోట్ల మట్టిని సేకరించి మెత్తగా చేసుకోవాలి. ఆపై శుభ్రమైన గడ్డ, సంచి, కాగితంపై చతురసాకారంగా పరిచి పైన రెండు, కింద రెండు భాగాలుగా విభజించాలి. అనంతరం 1, 4 లేదా 2, 3 భాగాలను ఎంచుకుని మిగతాది తీసి వేసి మళ్లీ మొదట్లో చెప్పినట్లు చేస్తూ అర కిలో మట్టి మిగిలే వరకు చేయాలి. అలా మిగిలిన మట్టిని నీడలో ఆరబెట్టాక శుభ్రమైన గుడ్డ సంచి లేదా పాలిథిన్ సంచిలో కానీ నింపాక అంతకు ముందే వేసిన పంటలు, ఉపయోగించిన ఎరువు వివరాలు రాసి పరీక్షకు పంపాలి.

మధిర పోలీసుస్టేషన్ అప్‌గ్రేడ్

ఎస్‌హెచ్‌ఓ స్థాయికి చేరిన టౌన్ పీఎస్



ఎస్‌హెచ్‌ఓ రమేష్

మధిర: ఇన్నాళ్లు ఎస్సై స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న మధిర పట్టణ పోలీసుస్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో భాగంగా పోలీసుస్టేషన్‌కు సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ఈమేరకు ఎస్‌హెచ్‌ఓగా డి.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ సీఐగా ఉన్న డి.మధు మధిర రూరల్, ఎర్రుపాలెం, బోనకల్ పోలీస్ స్టేషన్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

త్వరలోనే సబ్‌డివిజన్

మధిర సర్కిల్‌ను త్వరలోనే సబ్ డివిజన్‌గా మార్చనున్నట్లు తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుగా ఉండడంతో శాంతిభద్రతల దృష్ట్యా ప్రత్యేక సబ్ డివిజన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన చాన్నాళ్లుగా ఉంది. ప్రస్తుతం టౌన్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా సీఐను నియమించారు. దీంతో మధిర కేంద్రంగా ఇద్దరు సీఐలు విధులు నిర్వర్తించనున్నారు. ఇక మధిర పోలీస్ సర్కిల్ పరిధిని త్వరలోనే సబ్ డివిజన్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

మా లక్ష్యం.. ఒకే ఎన్నిక

- వారిని పొలిమేరలు దాటిస్తేనే సీఎం మాటలపై నమ్మకం
- మెదక్ ఎంపీ రఘునందనరావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందనరావు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరగాలనేదే తమ పార్టీ విధానమని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే వ్యయం తగ్గుతుందని, ఆ నిధులతో సంక్షేమ పథకాల అమలుకు అవకాశముంటుందని చెప్పారు. ఖమ్మంలో శుక్రవారం 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అంశంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సదస్సులో రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. వామపక్షాలకు ప్రజలు ఇప్పటికే మంగళం పాడారని, అందుకే తెలంగాణలో ఒక సీటుకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఇక సరైన మార్గంలో బీజేపీ మాత్రమే పయనిస్తున్నందున, రాబోయే రోజుల్లో తెలంగాణలో తమ పార్టీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. కాగా, పాకిస్తాన్‌పై పోరులో భారత ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలోని మదర్సాల్లో తలదాచుకున్న పాక్ మద్దతుదారులు, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వలసవాదులను రాష్ట్ర పొలిమేరలు దాటించాలని సూచించారు. ఇద్దరు మహిళా అధికారుల నేతృత్వాన ఆపరేషన్ సిందూర్‌ను ద్వారా తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించడం ద్వారా భారత సైన్యం సత్తా అందరికీ తెలిసిపోయిందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఈసమావేశంలో నాయకులు దేవకి వాసుదేవరావు, సన్నే ఉదయ్‌ప్రతాప్, దొంగల సత్యనారాయణ, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వరావు, మేకల నాగేందర్, ఆర్‌వీఎస్.యాదవ్, పుల్లారావు యాదవ్, తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, నున్న రవికుమార్, పెరుమాళ్లపల్లి విజయరాజు, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విజయీభవ

కూసుమంచి: ఆపరేషన్ సిందూర్ నేపథ్యాన సెలవులో ఉన్న సైనికులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కూసుమంచి మండలం గోరీలపాడు తండాకు చెందిన సైనికులు బానోత్ భాస్కర్, తేజావత్ రమేష్ శుక్రవారం విధినిర్వహణకు బయలుదేరారు. ఈ సందర్భంగా తండా పెద్దలు, గ్రామస్తులు వీరిని సత్కరించి, విధుల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు.



విధులకు వెళ్తున్న సైనికులను సన్మానిస్తున్న స్థానికులు

ఉద్యోగం ఇవ్వలేదని విద్యుత్ నిలిపివేయించిన మహిళ

కారేపల్లి: కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆరు గంటల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే, ఇందుకు సాంకేతిక లోపాలేవీ కారణం కాదు. భాగ్యనగర్ తండాలో 2016వ సంవత్సరంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు లకావత్ లక్ష్మి 14గుంటల స్థలాన్ని ఇచ్చింది. ఇందుకు బదులు తన మేనల్లుడు కల్యాణ్‌కు ఉద్యోగం ఇవ్వాలని కోరగా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు అంగీకరించారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాకపోగా, ఆందోళన చేసిన ప్రతీసారి అధికారులు సర్దిచెబుతున్నారు. చివరకు శుక్రవారం ఆమె సబ్‌స్టేషన్‌లోకి ప్రవేశించి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని, లేకపోతే పురుగుల మందు తాగుతానని బెదిరించడంతో ఆపరేటర్ సరఫరా నిలిపేశాడు. ఉదయం 8నుంచి సాయంత్రం 3గంటల వరకు సరఫరా నిలిచిపోవడంతో 8గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. మాజీ జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సిలాల్, గ్రామపెద్దలు భూక్యా బాలాజీ, వాంకుడోతు మత్రు చేరుకుని లక్ష్మి, ఆమె మేనల్లుడితో చర్చించినా, విద్యుత్ అధికారులు త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పినా ససేమిరా అన్నారు. దీంతో చేసేదేం లేక అధికారులు కారేపల్లి క్రాస్ సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు.

ఖమ్మంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

ఖమ్మం మయూరిసెంటర్: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర నాలుగో మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గుండు మాధవరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమాల ఖిల్లా అయిన ఖమ్మంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభల నిర్వహణకు నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులందరూ సభల జయప్రదానికి సహకరించాలని కోరారు. అనంతరం సభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా కళ్యాణం వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సుధాకర్, కోశాధికారిగా గుగ్గిళ్ల రోశయ్యను రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ ప్రతిపాదించగా ఆమోదించారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ తదితర సంఘాల నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, వై.విక్రం, పిట్టల రవి, కుడుదుల వెంకన్న, తోకల బాబు, పగిళ్లపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లొస్తూ ఐటీసీ కార్మికుడు మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు, సీతారాంపురం గ్రామాల మధ్య మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన మద్ది నరేష్(35) సారపాకలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ఐటీసీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామానికి చెందిన యువతితో నరేష్‌కు వివాహం జరిగింది. రాత్రి డ్యూటీ చేసి ఉదయం మణుగూరులో బంధువుల పెళ్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రంలో బీజీ కొత్తూరు, సీతారాంపురం గ్రామాల మధ్య మణుగూరు వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ను ఢీకొట్టగానే నరేష్ పక్కకు పడిపోగా, బైక్ లారీ టైర్ల మధ్య ఇరుక్కుపోయింది. లారీ అలాగే ఈడ్చుకుపోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో వాహనదారులు భయాందోళన చెందారు. స్థానికులు నీళ్లతో మంటలు ఆర్పారు. ఎస్సై మధుప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మణుగూరులో ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పుడే మాట్లాడావు అప్పుడే చనిపోయావా అంటూ రోదించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

బోనకల్: మండలంలోని చిరునోముల వద్ద ఈనెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా దేశిపాలెంకు చెందిన డిగ్రీ విద్యార్థి వడ్డెపూడి ఉపేందర్(20) వేసవి సెలవుల్లో బోనకల్ మండలం చొప్పకట్లపాలెంలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. ఆయన బావతో పాటు ఆటోలో బోనకల్ వస్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈమేరకు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృత చెందాడు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

భార్య ఉరి వేసుకున్న ఫ్యాన్‌కే భర్త కూడా..



రేవతి – కోటేశ్వరరావు (ఫైల్)

ఖమ్మంక్రైం: కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్య చేసుకోగా.. ఆ కాసేపటికే ఆమె భర్త కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం వన్‌టౌన్ పరిధి రైల్వే క్వార్టర్స్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. క్వార్టర్స్‌లో పెరిక కోటేశ్వరరావు(45), రేవతి(37) ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. రేవతి రైల్వే గేట్ ఉమెన్‌గా, కోటేశ్వరరావు ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతుండగా, శుక్రవారం కూడా ఘర్షణ జరిగింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన రేవతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కాసేపటికి గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. ఈ విషయం తెలియగానే కోటేశ్వరరావు ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చి భార్య ఉరి వేసుకున్న ఫ్యాన్‌కే తాడు బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు దంపతుల కుమారుడు గురుచరణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత

ఖమ్మంక్రైం: కడుపునొప్పి భరించలేని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం సంభానీగర్‌కు చెందిన తంగిళ్లపల్లి శ్రావణి(22), ప్రశాంత్ దంపతులు ముస్తఫానగర్‌లో నివసిస్తున్నారు. శ్రావణి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా చికిత్స చేయించినా ఫలితం కానరాలేదు. దీంతో ఆమె శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఆమె తండ్రి వెంకన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

ఏన్కూరు: విద్యుదాఘాతం కారణంగా రెండు పాడి గేదెలు మృతి చెందాయి. మండలంలోని తూతకలింగన్నపేట వాసులైన చింతనబోయిన నర్సింహారావు, చింతనబోయిన రాందాసుకు చెందిన రెండు పాడిగేదెలు గురువారం ఉద యం మేత కోసం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శుక్రవారం ఉదయం వెతుకుతూ వెళ్లగా ఇందిరనగర్ కాలనీలోని పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెంది నట్లు గుర్తించారు. రూ.2లక్షల మేర నష్టపోయిన తమకు పరిహారం అందించాలని రైతులు కోరగా, పశువైద్యాధికారి సుబ్బారావు పరిశీలించారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

తిరుమలాయపాలెం: ఆన్‌లైన్‌లో వచ్చిన వస్తువు ఇచ్చే విషయమై ఏర్పడిన వివాదం తారస్థాయికి చేరగా, ఐదుగురిపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మండలంలోని పిండిప్రోలుకు చెందిన మడికంటి వెంకటేష్ వద్దకు ఆన్‌లైన్‌లో వస్తువు రాగా, గ్రామానికే చెందిన సతీష్‌కు ఇచ్చేందుకు ఈ నెల 3న వెళ్లాడు. వీరిద్దరి నడుమ ఫోన్‌లో గొడవ జరగగా, వెంకటేష్‌కు తోడు రామయ్య, చామకూరి అశోక్, మడికంటి వెంకన్న, చామకూరి సీతమ్మ వచ్చారు. ఈక్రమంలో సతీష్ తరఫున వచ్చిన రవిని వారు కులం పేరుతో దూషించడంతో, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.